## కౌలతల ప్రకారం పనులు చేయాలి

బోథ్, ఏప్రిల్ 8 : ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు కొలతల ప్రకారం పనిచేయాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కౌఠ(బీ) గ్రామంలో సీసీటీ పనులు పరిశీలించారు. కూలీల హాజరు మాస్టర్‌ను పరిశీలించారు. ఎండల దృష్ట్యా ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్ఏలు, కూలీలున్నారు.

## 23వ రోజుకు నిరాహార దీక్షలు

ఎదులాపురం, ఏప్రిల్ 8: కాలనీల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఆదిలాబాద్ రూరల్ పరిధిలోని అర్లి బీ గ్రామ పంచాయతీ పరిధిలోని నిశాన్‌ఘాట్ కాలనీ, మావల మండలంలోని 170 సర్వే నంబర్లు కాలనీలో మంచినీరు, కరెంటు, ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే అసలు ఉన్నాడో లేదో మాకు తెలియదన్నారు. కార్యక్రమంలో ఎస్ అరుణ్ కుమార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కాంబ్లే రామదాస్, అర్లీ కార్యదర్శి సాగర్, విద్యార్థి యువజన సంఘం నాయకులు కే చందు, కే సురేశ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రావద్దు

భైంసా, ఏప్రిల్, 8 : వేసవి కాలం దృష్ట్యా తాగునీటి కోసం గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. మంగళవారం భైంసాలోని తన నివాసంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, బోరు బావులు వేయించాలని, అవసరమైతే ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు.

## బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా

ఎదులాపురం, ఏప్రిల్ 8: బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. దస్నాపూర్ పద్మావతి కాలనీకి చెందిన గిత్తి సూర్యకాంత్, పద్వల్ పంకజ్, శాంతినగర్‌కు చెందిన నమ్మినవార్ విశాల్, టీచర్‌కాలనీకి చెందిన అలావత్ బల్‌దేవ్ సింగ్ సోమవారం రాత్రి పట్టణంలోని ట్రేడ్స్ కలెక్షన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ అల్ట్రావిన్ యాప్ ద్వారా బెట్టింగ్ పెడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద రూ.2210 నగదు నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పట్టణంలో బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బెట్టింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కోడిగుడ్ల లారీ బోల్తా

నేరడిగొండ, ఏప్రిల్ 8 : మండలంలోని కొర్టికల్ గ్రామ సమీపంలో కోడిగుడ్ల లారీ బోల్తా పడిందని నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి మహారాష్ట్ర సార్కానికి కోడిగుడ్లతో మినీవ్యాన్ వెలుతోంది. కొర్టికల్ గ్రామ సమీపంలో ఓ బైక్ వ్యానుకు అడ్డుగా అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ శాడు. దీంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కోడిగుడ్లు పూర్తిగా ధ్వంస మయ్యాయని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## పరీక్షా కేంద్రం పరిశీలన

ఉట్నూర్, ఏప్రిల్ 8 : గిరిజన విద్యార్థులకు ఇంటర్మీడియట్, ఐఐటీ, జేఈఈ శిక్షణకు ఎంపికలో భాగంగా స్థానిక కేబీలో నిర్వహిస్తున్న పరీక్షలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమాల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, ఐఐటీ, జేఈఈ శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న పరీక్షకు 586 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో భాగంగా వీరికి 3 కేంద్రాలను ఏర్పాటు చేయగా 538 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. ఇక్కడ వివిధ శాఖల అధికారులున్నారు.

## చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి

బోథ్, ఏప్రిల్ 8 : చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ సూచించారు. మంగళవారం మండలంలోని కౌట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లిచేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శశిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలి

జైనథ్, ఏప్రిల్ 8 : విద్యార్థులకు అవగాహన పెంచేందుకు ప్రతి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంపూర్(టీ) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లోనే పౌష్టికాహారం తీసుకోవాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో జైనథ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లస్మన్న, ప్రముఖ వ్యాపారవేత్త మాధవ్, హెచ్‌ఎం వీరకుమార్, ఉపాధ్యాయులు విఠల్, సురేశ్, హేమలత, తల్లిదండ్రులు గంగన్న, స్వామి, వెంకన్న, రవీందర్, శ్రీకాంత్, భూమన్న, అశోక్, శ్రీనివాస్, దత్తు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంట్లో గొడవలతో యువతి ఆత్మహత్య

ఇచ్చోడ, ఏప్రిల్ 8 : ఇంట్లో గొడవలతో మనస్తాపం చెందిన యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ముక్రా(బీ) గ్రామానికి చెందిన షేక్ రఫీ కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవలు పడేవాడు. దీంతో మనస్తాపం చెందిన రఫీ కూతురు ఫిర్దోస్(16) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. తల్లి జాబీనాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

## అసాంఘిక కార్యక్రమాల సమాచారమివ్వాలి

తాంసి, ఏప్రిల్ 8 : గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారమివ్వాలని సీఐ ఫణిధర్, ఎస్ఐ రాధిక సూచించారు. మంగళవారం మండలంలోని అంబుగాం గ్రామంలో పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ గ్రామ పెద్దలున్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని బీర్సాయిపేట్ గ్రామంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 4.900 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ మొగిలి పేర్కొన్నారు. మండలంలోని లక్కెట్టిపేట్ గ్రామానికి చెందిన సట్ల గంగన్న, బీర్సాయిపేట్ గ్రామానికి చెందిన జైనేని ఎల్లయ్య మహారాష్ట్ర నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి ఇంటికి తెచ్చుకున్నారు. కరీంనగర్, హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించడానికి సిద్ధమై సంచులతో వస్తుండగా తమకు అందిన సమాచారంతో ఇంద్రవెల్లి ఎస్ఐ దుబ్బాక సునీల్‌తో కలిసి పట్టుకున్నామని తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

# కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- కుమారి- గాజిలి బీటీ రోడ్డుకు భూమిపూజ



కుమారిలో బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఏప్రిల్ 8 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమైందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం మండలంలోని కుమారి గ్రామం నుంచి గాజిలి గ్రామం వరకు రూ.2.19 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామలకు రోడ్లు ఇవ్వలేక పోతోందన్నారు. మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిన రోడ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంపై ప్రభుత్వ పనితీరు అర్థమవుతుందన్నారు. కేసీఆర్ హయాంలోనే మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించారన్నారు. బోథ్ నియోజకవర్గంలో మరికొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ముందుగా ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజుయాదవ్, పెంట వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, గడ్డం భీంరెడ్డి, అరుణ్‌గౌడ్, కొయ్యడి గంగయ్య, తులసీదాస్, హన్మయ్య,రాజేశ్వర్, అనిల్‌యాదవ్, ముత్యం యాదవ్, సంతోష్, కమలాకర్, పురుషోత్తం రెడ్డి, రాథోడ్ సురేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తులం బంగారం వెంటనే అందించాలి

బోథ్, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం వెంటనే అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బోథ్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్, సొనాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ రూ.లక్షా 116 మాత్రమే అందిస్తున్నదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చందర్, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు సదానందం, డాక్టర్ స్వామి పాల్గొన్నారు.



వర్షానికి దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలి

నేరడిగొండ, ఏప్రిల్ 8 : ఇటీవల అకాల వర్షంతో జొన్న పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం కుమారి గ్రామ పర్యటనలో భాగంగా వర్షానికి కుప్టి గ్రామ రైతు వెంకటరమణ పడిపోయిన జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రైతులను పట్టించుకున్న వారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షానికి నష్టం జరిగిన రైతుల వివరాలను వెంటనే సేకరించాలను సంబంధిత వ్యవసాయాధికారిని కోరారు. సంబంధిత వివరాలను తనకు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో రైతుల ఇళ్ల ముందు ఉన్న జొన్నలను పరిశీలించారు. జొన్నల కొనుగోళ్లు ప్రారంభించేలా చూడాలని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, ఇచ్చోడ పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, రైతులు వెంకటరమణ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులతోనే సన్న బియ్యం పంపిణీ

భైంసాటౌన్, ఏప్రిల్ 8: మండలంలోని పాంగ్రి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సన్న బియ్యం పంపిణీ ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ బియ్యం ఇచ్చేది కేంద్రమేనని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందని అన్నారు. ఆయన వెంట నాయకులు సిరం సుష్మారెడ్డి, ఆనంద్ రావ్ పటేల్, రాందాస్, బాలాజీ, రాజారాం తదితరులున్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఖానాపూర్, ఏప్రిల్ 8: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఖానాపూర్ సివిల్ కోర్టులో మంగళవారం విధులు బహిష్కరించినట్లు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు బయట నిల్చొని నినాదాలు చేశారు. హైదరాబాద్, గోదావరిఖని, భీమవరంలో న్యాయవాదులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, న్యాయవాదులు షబ్బీర్‌పాషా, వెంకట్ మహేంద్ర, శివ, సలీం తదితరులున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 8 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండల కేంద్రంలోని కొత్తగూడెం కాలనీలో మంగళవారం ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్లువస్తే లిఫ్ట్ చేయవద్దని, ఓటీపీలు చెప్పుమంటే చెప్పవద్దని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు గోకుల్‌దాసు, షఫీ, రజిత, వనిత, తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పారదర్శకంగా అందజేయాలి

ఖానాపూర్, ఏప్రిల్ 8: నిరుపేదలకు ప్రతిష్టాత్మకంగా అందించే సన్న బియ్యం లబ్ధిదారులకు పారదర్శకంగా అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీపై ఆరా తీశారు. స్టాక్ బోర్డు, బియ్యం నిల్వల వివరాలు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సుజాత, ఎంపీవో రత్నకర్‌రావు, రేషన్ డీలర్ రాజన్న, పలుశాఖల అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కుభీర్, ఏప్రిల్ 8 : ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ అన్నారు. మండలంలోని పార్డి(కె) గ్రామంలో మంగళవారం ఆయన ఎంపీవో మోహన్ సింగ్‌తో కలిసి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన నర్సరీని, మండలంలోని పైలెట్ గ్రామమైన అంతర్నిలో ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు నర్సయ్య, విజయ్ కుమార్, రేషన్ షాపు డీలర్ కలీమొద్దిన్ తదితరులున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

భైంసా, ఏప్రిల్, 8 : రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ సురేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏరియా దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయన్నారు. అనంతరం ఓపీ గదుల్లో వైద్యుల హాజరు, ఓపీ నమోదు, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఇక్కడ వెంట ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, తదితరులున్నారు.

## అడవి పందుల రవాణాలో నిందితులకు రిమాండ్

భైంసా, ఏప్రిల్ 8 : అడవి పందుల అక్రమ రవాణా కేసులో నిందితులు ముగ్గురికి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎఫ్‌ఆర్వో సట్ల వేణుగోపాల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సంజయ్ జాదవ్, అనిల్ జాదవ్, కృష్ణ అడవి పందులను బొలెరో వాహనంలో తరలిస్తూ ముథోల్ మండలం బోర్‌గాం వద్ద పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ మేరకు నిందితులను మంగళవారం పట్టణంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఇక్కడ డీఆర్వో శంకర్, సిబ్బంది ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 : సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎండకాలంలో వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడారు. అనంతరం దవాఖానలోని రికార్డులు, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎండాకాలంలో వడదెబ్బ తగులకుండా ఆశ కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రియాంక తదితరులున్నారు.

## దరఖాస్తు ఫాంలు మున్సిపల్‌లో అందించాలి

భైంసా, ఏప్రిల్, 8 : రాజీవ్ యువ వికాసం పథకం సబ్సిడీ రుణాల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ బీ రాజేశ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అందిచనున్న రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈ నెల 14 వరకు అవకాశమిచ్చిందన్నారు. దరఖాస్తు ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో అందించాలని తెలిపారు.

## డంప్ యార్డులో జంతు కళేబరాలు వేయద్దు

భైంసా, ఏప్రిల్ 8 : పట్టణంలోని కమలాపూర్ గుట్ట వద్ద డంప్ యార్డులో జంతు కళేబరాల వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్‌కు పలువురు వినతి పత్రం అందించారు. ప్రతిరోజూ బీఫ్ మార్కెట్‌కు సంబంధించిన జంతువుల వ్యర్థాలు డంపింగ్ యార్డులో వేస్తున్నారని దీంతో అటువైపుగా వెళ్లే వాకర్స్, హనుమాన్ భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున మున్సిపల్ అధికారులు స్పందించి అక్కడున్న జంతు వ్యర్థాలను తొలగించడంతో పాటు, ఇకనుంచి జంతు వ్యర్థాలు వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రావుల పోశెట్టి, మల్లేశ్వర్, దిలీప్, వెంకటేశ్, అనిల్ తదితరులున్నారు.

## బాలికల సంరక్షణపై అవగాహన

సారంగాపూర్, ఏప్రిల్ 8 : మండలంలోని జామ్ బాలికల గురుకుల విద్యాలయంలో మంగళవారం ఎస్ఐ శ్రీకాంత్, షీ టీం ఇన్‌చార్జి పెరిసిస్ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణ, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి సమాజంలో బాలికలు, మహిళలపై లెంగిక వేధింపులు, నివారణ చర్యలపై విద్యార్థినులకు వివరించారు. బాలికలు, మహిళలకు ఏమైనా సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సంగీత, షీ టీం సభ్యులు రాధిక, రజిత, సుకన్య, ఉమాభారతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులున్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్
- చొండిలో కార్డన్ సెర్చ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్

కుభీర్, ఏప్రిల్ 8 : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా గ్రామ అభివృద్ధికి పాటుపడాలని భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ సూచించారు. మండలంలోని చొండి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ముందుగా గ్రామంలో తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని అన్ని వాహనాలను జీపీ కార్యాలయ ఆవరణలోకి తరలించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు కలిగి ఉండడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిరోధించడమే కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశమన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనదారుల కు జరిమానా విధించారు. భైంసా రూరల్ ఎస్ఐ నైలు నాయక్, కుభీర్, కుంటాల, భైంసా రూరల్ ఎస్ఐలు పీ రవీందర్, అశోక్, శంకర్, సర్కిల్ పోలీసు సిబ్బంది, మాజీ సర్పంచ్ చంద్రకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గడిచిన ఏడాదిలో 90 శాతం పన్నుల వసూళ్లు

- డీటీసీ రవీందర్ కుమార్



మాట్లాడుతున్న డీటీసీ రవీందర్ కుమార్

ఎదులాపురం, ఏప్రిల్ 8: వాహనదారులు రోడ్డు, లైఫ్ ట్యాక్స్‌ని విధిగా చెల్లించాలని డీటీసీ రవీందర్ కుమార్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని డీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వార్షిక లక్ష్యాలను వివరించారు. వాహనదారులు లైఫ్ ట్యాక్స్‌తోపాటు క్వార్టర్లీ, ఇయర్లీ ట్యాక్స్‌లు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 ఆర్థిక సంవత్సరంలో రవాణా శాఖకు ఇచ్చిన పన్నుల లక్ష్యాన్ని 90 శాతం పూర్తి చేశామని తెలిపారు. బోరజ్ చెక్‌పోస్టు వల్ల 12 మంది ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా 10 మంది లక్ష్య సాధనకు కృషి చేశారన్నారు. వాహనాలు నిలిపి ఉన్న వివరాలు ఆర్టీవో కార్యాలయంలో తెలియజేస్తే దానికి సంబంధించి ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కానీ చాలా మంది వాటి వివరాలు తెలియజేయడం లేదన్నారు. ఫిట్‌నెస్ కోసం ఏటీసీ సెంటర్ ఏర్పాటుకు కలెక్టర్ గుడిహత్నూర్ వద్ద స్థలం కేటాయించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, త్వరలోనే అదిలాబాద్‌లో చిల్డ్రన్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# సన్నం బియ్యంతో పేదలకు మేలు

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



దళిత కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఖానాపూర్, ఏప్రిల్ 8 : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారుడు పల్లెర్ల సుజాత రాజేశ్వర్ దంపతుల ఇంట్లో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. లబ్ధిదారుడి వృత్తి, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఎస్సీ కాలనీలో కలెక్టర్ పర్యటించారు. సౌకర్యాలు, సమస్యలు కాలనీవాసులను అడిగి తెలుసకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, కార్యదర్శి రిజ్వాన, రేషన్ డీలర్ రాజన్న, గ్రామస్తులు ఉన్నారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా

ఢీకొట్టిన మోటర్ గ్రేడర్ వెహికిల్



బోల్తా పడిన బస్సును క్రేన్ సాయంతో పైకి లేపుతున్న పోలీసులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 8: రోడ్డు పనుల్లో ఉపయోగించే వాహనం ఢీకొట్టడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడగా ఏడుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కేయూ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ డిపోకు చెందిన లహరి ఏసీ బస్సు ఆదిలాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్లి తిరిగి సోమవారం 4.30 గంటలకు ఆదిలాబాద్‌కు బయల్దేరింది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకొని ఆదిలాబాద్‌కు వెళ్తూ సుమారు 3.30 గంటలకు చింతగట్టు ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద చేరుకుంది. అదే సమయంలో బ్రిడ్జి వద్ద రోడ్డు పనులు చేసేందుకు ఉపయోగించే (మోటర్ గ్రేడర్ వెహికిల్) వాహనాన్ని డ్రైవర్ ఇండికేటర్, లైట్స్ వేయకుండా ఒక్కసారిగా రోడ్డుపైకి రివర్స్ తీశాడు. దీంతో ఆర్టీసీ బస్సు ముందు టైరును ఢీకొంది. వెంటనే బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో బస్సులో ఉన్న బత్తుల వెంకటేశ్, గంపాల శ్రీకాంత్, జాకీర్ హుస్సేన్, వోజ్జ కోటేశ్వర్‌రావు, మోజీ, కళ్లెం రత్నరాజు, మరో డ్రైవర్ మారంపెల్లి సుభాశ్‌చంద్రకు తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు వెంటనే సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది చేరుకొని ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా మోటరు గ్రేడర్ వెహికిల్ డ్రైవర్ వినోద్‌సింగ్ (మధ్యప్రదేశ్) పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ ఎస్ఐ తెలిపారు.

## వార్షిక పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 8 : నేటి నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారి గంగాధర్ సూచించారు. మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ప్రధానోధ్యాయులకు వార్షిక పరీక్ష పత్రాలు అందించారు. ఇక్కడ సీఆర్పీ తిరుపతి, ఐఆర్పీ జగన్, తదితరులున్నారు.

## నేటి ఫిర్యాదుల విభాగం వాయిదా

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 8 : భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎస్పీ జానకి షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి బుధవారం భైంసా డివిజన్ ప్రజల సౌకర్యార్థం ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని తెలిపారు.

## పండ్లు పంపిణీ

ఎదులాపురం, ఏప్రిల్ 8 : అమ్మగారి జ్ఞాపకార్థం కుమారులు సేవా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన గాజరి మణెమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కేఆర్‌కే కాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుమారులు గాజరి జగదీష్, గాజరి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు గాజరి శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

## ట్రైబల్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజ్ రోడ్‌లోని ట్రైబల్ పురుషుల డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివకృష్ణ ప్రకటనలో తెలిపారు. బీఏ(హెచ్ఈపీ), బీకామ్(సీఏ), బీఎస్సీ, బీజడ్‌సీ, డాటా సైన్స, స్టాటస్టిక్స్ ఉన్నాయన్నారు. వివరాలకు 9849390495, 8309511010, 7901097689, https:// ttwrdes.ac.in/Boath సంప్రదించాలని సూచించారు.

## మట్కా నిర్వహణపై ఉక్కుపాదం

జైనథ్, ఏప్రిల్ 8: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పూసాయి గ్రామ శివారులో మట్కా నిర్వహిస్తున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు జైనథ్ ఎస్ఐ పురుషోత్తం, ఏఎస్ఐ సిరాజ్ ఖాన్, కానిస్టేబుళ్లు శివాజీ, స్వామి కలిసి దాడి చేశారు. మట్కా నిర్వహిస్తున్న కడదారపు గంగన్న, రకేందర్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద గల రూ.4190, సెల్‌ఫోన్ సీజ్ చేసి ఫోన్‌లోని మట్కా చిట్టీలను స్వాధీనపరుచుకున్నారు. సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి అట్టి మట్కా డబ్బులను ఏ3 గజ్జ బోరి మహారాష్ట్రకు పంపుతున్నాడు. వారిపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- ఏడు తులాల బంగారం, రూ.2.4లక్షల సొత్తు అపహరణ

సోన్, ఏప్రిల్ 8 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం, కొండాపూర్ గ్రామ పరిధిలోని బొమ్మరిల్లు టౌన్‌షిప్‌లో గల బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి వారి కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. శ్రీకాంత్‌రెడ్డి భార్య గీతారెడ్డి కడెం మండలంలో ఎఫ్‌ఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఆమె భర్త శ్రీకాంత్‌రెడ్డి తన కుమారున్ని తీసుకొని అదేరోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి వెళ్లారు. మరుసటి రోజు అనగా మంగళవారం ఉదయం తమ ఇంటికి వచ్చి చూడగా ఇంటికి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉండగా అనుమానం వచ్చి చూడగా ఏడు తులాల విలువైన బంగారు గాజులు, రెండు నెక్లెస్‌లు, ఒక లాకెట్, జత కమ్మలతో పాటు రూ. 2.40వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే నిర్మల్ రూరల్ పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రమాదం కేసులో నిందితునికి తొమ్మిది నెలల జైలు

సోన్, ఏప్రిల్ 8 : సోన్ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఒకరికి 9 నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు తీర్పు వెల్లడించినట్లు కోర్టు లైజన్ అధికారి దల్లుసింగ్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, 2016లో సోన్ మండలంలో గంజాల్ టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న కొండ సంతోష్‌గౌడ్ అనే వ్యక్తి అటువైపుగా వెళ్తున్న చిల్ల సంగరత్నను ఢీకొట్టాడు. దీంతో అక్కడే టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న రాథోడ్ కైలాస్ అనే వ్యక్తి సోన్ మండల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిర్మల్ జిల్లా కోర్టులో హాజరుపరిచారు. అప్పటి నుంచి వాదనలు కొనసాగుతుండగా తాజాగా మంగళవారం నిందితుడు కొండ సంతోష్‌గౌడ్‌కు 9 నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్ అజయ్‌కుమార్ తీర్పును వెల్లడించారు. కేసు పురోగతిలో సహకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవేందర్, అప్పటి సోన్ ఎస్ఐ శ్రీరాం ప్రదీప్‌తోపాటు కోర్టు కానిస్టేబుళ్లు గంగయ్య, భాస్కర్‌ను అభినందించారు.

## పేద విద్యార్థులకు వరం పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 8: అనాథ పిల్లలు, పేద విద్యార్థులకు 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచిత విద్యనందిస్తున్న పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రగతి విద్య సంస్థలో అడ్మిషన్ పొందడానికి ఈ నెల 24వ తేదీన నిర్వహించబోయే టాలెంట్ టెస్ట్ రాయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వివరాలకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా బాధ్యుల సెల్ నంబర్లు 9493001171, 9490357438ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మణ్ రావ్, జిల్లా ఉపాధ్యక్షులు సురేఖ, సూర్య కుమార్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు విలాస్, శివన్న, స్వామి, గౌస్ మొహియుద్దీన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## కూలీలకు వసతులు కల్పించాలి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8: ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని నిర్మల్ డీఆర్డీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌తో పాటు కాల్వ, న్యూలోలం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కూలీలతో ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ) మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నీకల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, ఏపీవో దివ్యరెడ్డి పాల్గొన్నారు.